క్లుప్తంగా

ఫాతిమా షేక్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: భారతదేశ మొట్టమొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకులాలతో పాటు ఉర్దూ మీడియం విద్యా సంస్థల్లో అధికారికంగా నిర్వహించాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై మైనారిటీ గురుకులాల కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్, మైనారిటీ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి, డైరెక్టర్ మైనారిటీ కార్యదర్శులకు లేఖలు రాశామని పేర్కొన్నారు.

బదిలీలు చేపట్టండి..

పాల్వంచ: జెన్‌కో సంస్థలో అన్ని స్టేషన్లలో పనిచేస్తున్న ఇంజనీర్లకు వారు కోరుకున్న చోటకు బదిలీలు చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ 7వ దశ సెక్రటరీ యాస్మిన్ కోరారు. శనివారం స్థానిక కేటీపీఎస్ 7వ దశ చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావును కలిసి అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ... ఇటీవల జెన్‌కోలో ఏఈలుగా నూతనంగా రిక్రూట్ అయి విధుల్లో చేరనున్నారని, ఈ క్రమంలో బదిలీలు చేపట్టాలన్నారు. ట్రెజరర్ సంపత్, బ్రహ్మాజీ, శ్రీకాంత్, రాజేష్, వెంకట్రావ్, అరుణ్‌కుమార్, లక్ష్మి, రాజేష్, గణేష్ పాల్గొన్నారు.

కరాటే శిక్షణ తరగతులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరుగుతున్న కరాటే శిక్షణ తరగతులను ఎంఈఓ బాలాజీ పర్యవేక్షించారు. మాట్లాడుతూ.. కరాటే విద్య ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి, ఏకాగ్రతకు మరియు సమాజంలో బాలికల పట్ల జరుగుతున్న దాడుల నుంచి తమని తాము రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ జే.లక్ష్మి, కరాటే శిక్షకుడు కాశీహుస్సేన్ పాల్గొన్నారు.

విజేత కరకగూడెం జట్టు

ఇల్లెందురూరల్: నూతన సంవత్సరం సందర్భంగా బొజ్జాయిగూడెం గ్రామంలో యంగ్‌తరంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలలో కరకగూడెం జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో జగదాంబగుంపు జట్టుపై కరకగూడెం జట్టు విజయం సాధించింది. విజేతలకు నగదు బహుమతులతోపాటు ట్రోఫీ, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, చీమల వెంకటేశ్వర్లు, కొర్స కోటయ్య, కుంజ శ్రీను, మాధవరావు, భరత్, బాబూరావు, మోకాళ్ల మునికుమార్, పొదెం ప్రశాంత్ పాల్గొన్నారు.

పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించండి..

పాల్వంచరూరల్: కిన్నెరసానిని సందర్శించే పర్యాటకులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బి.బాబు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కిన్నెరసానిని సందర్శించారు. డీర్‌పార్కుతోపాటు పర్యాటకులకు కల్పించే సౌకర్యాలపై ఆరా తీశారు. బోరుకు మరమ్మతులు చేయించాలని, సెప్టిక్ ట్యాంక్ నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. రేంజర్, కవిత మాధురి, ఎఫ్‌ఎస్‌ఓ కిషన్, ఎఫ్‌బీఓ రాములు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

టేకులపల్లి: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో టేకులపల్లిలో మండల స్థాయిలో వివిధ అంశాలలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఒలింపియాడ్లో తేజస్వి ప్రథమ, హర్షిత ద్వితీయ, వక్తృత్వ పోటీలలో ప్రథమ నజీబా, ద్వితీయ హర్షిత సాధించారు. వీరందరూ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం మెరుగు శ్రీనివాస్, ఇంగ్లిష్ టీచర్లు రవీందర్, శేషగిరి, ప్రవీణ్ అభినందించారు.

కొనసాగుతున్న సమ్మె

ఇల్లెందు: సివిల్ సప్లై హమాలీలు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ మేరకు శనివారం జీసీసీ వద్ద సమ్మెలో పాల్గొన్న హమాలీలకు జేఏసీ నేతలు డి.శంకర్, టి.కృష్ణ, యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. సివిల్ సప్లై కమిషనర్‌తో జరిగిన చర్చల ఒప్పందం మూడు నెలలు గడిచినా అమలు కావటం లేదన్నారు. సదానందం, మధు, వీరన్న, రామ్మూర్తి, గాంధీ, ఎలేందర్, శ్రీను, సీతారాములు, రవి, సందీప్, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత డొల్ల..

పాల్వంచ: పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడం లేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్న టెండర్లలో కాంట్రాక్టర్లు 30శాతం లెస్‌కు పనులు దక్కించుకుంటున్నారని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, గతంలో వేసిన రోడ్లన్నీ ఇప్పటికే దెబ్బతిన్నాయన్నారు. క్వాలిటీ కంట్రోల్ సరైన రిపోర్ట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. జిల్లా అధికారులు దృష్టి సారించాలని కోరారు.


రోటిలో పసుపు దంచుతున్న మహిళలు


పిండివంటలు చేస్తున్న మహిళలు


మంగళస్నానాల వేడుకలో యువత జోష్

పెళ్లి.. సందడే సందడి

- పూర్వ సంప్రదాయానికి ఆధునికత జోడిస్తూ..
- ఏడు రోజుల తంతుగా వివాహాలు
- పట్టణ ప్రాంతాలలో మారుతున్న ట్రెండ్
- ఖర్చుకు తగ్గేదేలే.. అంటున్న నేటితరం

ఒకప్పుడు పాణిగ్రహణాలు ఏడు రోజులు జరిగేవి. సంప్రదాయం ఉట్టిపడేలా వారంరోజుల పాటు పెళ్లి ఇంట బంధువుల సందడి చూడముచ్చటగా ఉండేది. ఆ తరువాత ఖర్చును మితం చేసుకునే క్రమంలో పెళ్లి సందడి కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిని బట్టి ఒకటి రెండు రోజులకే పరిమితమైంది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల తరం నుంచి అమ్మానాన్న తరం వరకు వివాహ తంతులో వచ్చిన మార్పులివి. ఇప్పుడు ఆధునికత జోడిస్తూ మళ్లీ పాత రోజులు వచ్చాయి. ఈ తరానికి కల్యాణ తంతు వారంరోజుల వేడుకగా మారింది. పట్టణ ప్రాంతాలకు చేరుకున్న నయా ట్రెండ్ క్రమంగా పల్లెటూళ్లకూ చేరింది.

ఇల్లెందురూరల్: వివాహ బంధం నిశ్చయించడం మొదలు.. వేడుక పూర్తయ్యే వరకు అన్నీ తల్లిదండ్రుల అభీష్టం మేరకు వివాహ వేడుక కొనసాగడం పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయం. కానీ నేడు ట్రెండ్ మారింది. మనసెరిగిన వ్యక్తితో ఏడడుగులు నడవాలని అమ్మాయిలు. తమ ఇంటిని చక్కదిద్దగలరనే విశ్వాసంతో అబ్బాయిలు భాగస్వామి ఎంపికలో పరిణతితో వ్యవహరిస్తున్నారు. తాము ఇష్టపడ్డ వారి గురించి కన్నవారి మనసు కష్టపెట్టకుండా నచ్చచెపుతున్నారు. కులమతాలకు అతీతంగా ప్రస్తుతం ఎన్నో జంటలు ఒక్కటవుతున్నాయి. ఇది ఇక్కడితో ఆగలేదు. తమకు నచ్చినట్లు పెళ్లి వేడుక నిర్వహించాలని వధూవరులు కోరుకుంటున్నారు. ఎంత ఖర్చు అయినా పిల్లల అభీష్టం మేరకే తల్లిదండ్రులు వైభవంగా పెళ్లితంతు జరిపిస్తున్నారు.

పచ్చని పందిరి నుంచి కన్వెన్షన్‌లకు..

పెళ్లి ముహూర్తాలు పెట్టుకున్న తరువాత పసుపు దంచడానికి, పందిరి వేయడానికి కూడా ముహూర్తం పెట్టుకుంటారు. ఈ తతంగం పూర్తయ్యాక కొబ్బరి ఆకులు, తాటాకులతో ఇంటి ముంగిట పచ్చని పందిరిని సిద్ధం చేసేవారు. గెల వేసిన అరటి చెట్లు.. పాలకుల్లా పెళ్లి ఇంటి ముంగిట టీవీగా కొలువు దీరేవి. పందిరి కింద భాగంలో మామిడితోరణాలు వచ్చిపోయే వారి తలకు తాకుతూ సందడి చేసేవి. ఇలా ఇంటి ముందు వేసిన పెళ్లి పందిరే పెళ్లి మండపమయ్యేది. బంధువులు ఎక్కువ మంది ఉంటే ఊళ్లో ఆలయంలోని దేవుని మండపమే కళ్యాణ వేదిక. ఇప్పుడు వివాహ వేదిక ఫంక్షన్ హాల్‌కు తరలిపోయింది. మండపం అలంకరణలో పరదేశీ పూలు వచ్చి చేరాయి. పెళ్లితోపాటు నిశ్చితార్థం, రిసెప్షన్ వేదికలు కూడా ఇప్పుడు వ్యాపారంగా మారింది. అన్నీ కల్యాణ మండపాల్లోనే. కానీ వివాహ క్రతువు ఎక్కడ నిర్వహించినా ఇంటికి రంగులకే పరిమితం చేయకుండా మళ్లీ సంప్రదాయపు ట్రెండ్‌లో భాగంగా ఇప్పుడు పెళ్లిళ్లకు ఇంటి ముందు పందిరి వేయడం అనే ముచ్చట అందరినీ మురిపిస్తోంది.

ఏడు రోజుల పండుగ..

వివాహ తంతు ఏడు రోజులంటే ఏం చేస్తారు అని చాలామంది అనుకుంటారు. మెహందీ, గంధం, నలుగు పెట్టడం, పెళ్లికూతుర్ని చేయడం.. తాళి, తలంబ్రాలకు ఎటూ ఒకరోజు ఉంటుంది. మరుసటి రోజు అమ్మాయిని అత్తారింటికి తోడ్కొని వెళ్లడం. ఇక మధ్యలో సంగీత్ ఇలా ఏడురోజుల పెళ్లి సందడి. ఆ తరువాత సత్యనారాయణస్వామి వ్రతం.. అదయ్యాక పదహారు రోజుల పండుగ ఇలా పాత సంప్రదాయం మళ్లీ వచ్చింది.

సండే స్పెషల్


పెళ్లి వేడుకలో ఓ ఘట్టం

ఖర్చుకు తగ్గేదేలే..

పూర్వం అమ్మాయి పెళ్లంటే బంధువులు, స్నేహితులు తలా ఒక చేయి వేసి పెళ్లి చేసేవారు. పెళ్లి చూపులు మొదలు అప్పగింతల వరకు అన్ని ఖర్చులు స్థాయికి తగ్గట్లు మితంగా చేసేవారు. కానీ నేడు ఖర్చుకు తగ్గేదేలా అన్నట్లుగా సప్తపది ట్రెండ్ నడుస్తోంది. చిన్నవయసులో కుర్రకారు పెద్ద మొత్తంలో సంపాదిస్తుండటం భవిష్యత్‌లో మరింతగా ఆర్జించగలమనే ధీమాతో తమ పెళ్లితంతు.. నలుగురు ఔరా... అనేలా భారీగా ఖర్చు చేస్తున్నారు. తల్లిదండ్రుల వద్ద డబ్బు లేకపోతే వారే ఆ సొమ్మును సమకూరుస్తున్నారు. పెద్దపెద్ద నగరాల్లో ఉన్నా.. విదేశాల్లో ఉన్నా.. వారే కన్వెన్షన్ కేంద్రాల బుకింగ్ దగ్గర నుంచి పెళ్లిమంటపం అలంకరణ వరకు అన్ని ఏర్పాట్లు చూసుకుంటున్నారు. వివాహాలకు సంపన్నులు, ఎగువ మధ్యతరగతి వర్గాలు డెస్టినేషన్ వెడ్డింగ్స్ పేరుతో విదేశాలు, ఇతర నగరాలకు వెళ్తుంటే మధ్యతరగతి వర్గాలు కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టులలో పెళ్లి వేడుక చేస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ సూట్ నుంచి మొదలు పెట్టి ఎంగేజ్‌మెంట్, బ్యాచిలర్ పార్టీలు, మెహిందీ, సంగీత్, పెళ్లి, రిసెప్షన్ వరకు తగ్గేదేలే.. అంటూ ఖర్చు చేస్తున్నారు.

ముఖ్యపాత్రలో ఈవెంట్ మేనేజ్‌మెంట్..

పెళ్లి అనేక పండుగలను తెస్తుంది. ఇంతటితో ఆగదు. పనులనూ తెస్తుంది. ఒక్కప్పుడు ధాన్యం పట్టడం నుంచి విస్తరాకులు కుట్టడం వరకు అన్నీ ఇంట్లో వాళ్లే చేసుకునేవారు. బంధువులు కూడా సాయం చేసేవారు. ఇది సమష్టి కుటుంబతత్వానికి ప్రతీకగా నిలిచేది. ఇప్పుడు మారింది. ప్రతిదీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేతుల్లోనే. వధూవరులను సిద్ధం చేసే ప్రక్రియ నుంచి జీలకర్ర, బెల్లం పెట్టడం, తాళి కట్టడం, బారాత్, అప్పగింతలు.. అన్నీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధుల సూచనలతో వధూవరులు ఏడడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో వారు సంప్రదాయం కంటే హుషారైన పాటలు, జోష్ నింపే నృత్యాలకే ప్రాధాన్యమిస్తున్నారు. ఇది తరతరాలుగా ఆచరిస్తున్న వివాహ సంప్రదాయాన్ని మరిచిపోవడమే నయా వేడుకల్లో కొంత వెలితిగా కనిపిస్తోంది. కానీ నేడు మళ్లీ పెళ్లివేడుకలు ఇంటి ముందుకు రావడం... అటూఇటూ తిరిగి సంప్రదాయం మళ్లీ మొదటికొచ్చిందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పాల్వంచ: స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో స్థానిక తహసీల్దార్ జి.వివేక్ శనివారం నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగులు సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం పట్ల అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతోజు బ్రహ్మారావు, సెక్రటరీ ఎండీ.షహబుద్దీన్‌ఖాన్, ఎస్‌కే.జానిమియా, టి.కన్నయ్య, సుందర్‌రావు, గోవిందరావు, జయమ్మ, మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీపాద సత్యనారాయణ, ముత్యం, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో...

కొత్తగూడెంఅర్బన్: పాల్వంచ పట్టణంలోని అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల నూతన సంవత్సర క్యాలెండర్లను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తాళ్లూరి హరిబాబు, చిరుత మహేష్, చింతల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంఅర్బన్: అరోరా కళాశాలలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో..

ఇల్లెందురూరల్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన సంవత్సర క్యాలెండర్లను జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ శనివారం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఇల్లెందు బ్రాంచి మేనేజర్ నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ హీరాలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో బహిరంగ వేలంపాటను ఈనెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన కొత్త కాంప్లెక్స్‌లోని 4వ నంబర్ షాపుతోపాటు, రెండు ఏసీ ఫంక్షన్ హాల్స్‌కు, దేవస్థానం పోగుచేసిన చీరల విక్రయం, పాత కాంప్లెక్స్‌లోని 1వ నంబర్ షాపులోని బల్లలు, బొమ్మలు, ఇతర వస్తువుల అమ్మకం కోసం శుక్రవారం నిర్వహించిన టెండర్ కం బహిరంట వేలంపాటకు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

సీపీఐలో చేరిక

సుజాతనగర్: బేతంపూడి, నాన్యాతండా గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో శనివారం సీపీఐలో చేరారు. కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సాబీర్‌పాషా, భూక్యా దస్రు, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు, కొమారి కృష్ణ పాల్గొన్నారు.

బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శోభన్

సుజాతనగర్: సేవాలాల్ బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కోమటిపల్లి గ్రామానికి చెందిన భూక్యా శోభన్ నాయక్ నియమితులయ్యారు. శనివారం చుంచుపల్లిలో జరిగిన ఆ సంఘం సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్యా ప్రసాద్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. శోభన్ మాట్లాడుతూ... గిరిజనుల అభివృద్ధికి పాటుపడతానన్నారు.


మంత్రిని కలిసిన కౌన్సిలర్లు

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలోని ఆయన స్వగృహంలో ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్లు శనివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్లు లలిత శారద, పాబో, స్వాతి కిరణ్ ఉన్నారు.

యువకుడు మృతి

ఇల్లెందు: ఎన్‌జీఓ కాలనీకి చెందిన ఎం.రాఘవేంద్ర (25) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. రాఘవేంద్రకు ఛాతి నొప్పి రావటంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఏజెన్సీలో పత్తి కొనుగోళ్లు చేస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజనను శనివారం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ రాజేష్ నాయక్ హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాజేష్ నాయక్ మాట్లాడుతూ... జూలూరుపాడు తాత్కాలిక సబ్ మార్కెట్ యార్డులో అనుమతులు లేకుండా గిరిజనేతరులు పత్తి వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. పెసా, పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన పత్తి కౌంటర్లలో పత్తి కొనుగోళ్లను నిలిపివేయాలని కోరారు. గిరిజనేతరులు సిండికేటై పత్తి కొనుగోళ్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న గిరిజనేతరులపై తక్షణమే చర్యలు విన్నవించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఇల్లెందురూరల్: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో జనవరి 9న నిర్వహిస్తున్న ఆల్ ఇండియా డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండలంలోని పోలారం గ్రామంలో ప్రచార పోస్టర్లను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, శ్రీరాంకోటయ్య మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుభరోసా ఒకేసారి ఇవ్వాలని, రైతు రుణమాఫీ, అటవీహక్కుల చట్టం 2006 సమగ్రంగా అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్‌కు అనుకూల నిర్ణయాలు తీసుకుంటోందని, వీటిని తిప్పికొట్టి ప్రజలు దేశవ్యాప్త ఐక్య మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మాస్‌లైన్, ఏఐయూకేఎస్ నాయకులు మోడెం రాంబాబు, జూకంటి అనంతచారి, గాంధీ, వల్లోజి చంద్రశేఖర్, రామచుక్కమ్మ, బండి నారాయణ, కృష్ణ, మోహన్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

హామీలు అమలు చేయించడమే లక్ష్యం

టేకులపల్లి: ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయించడమే ఐఎన్‌టీయూసీ లక్ష్యమని యూనియన్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజు, ఇల్లెందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ గోచికొండ సత్యనారాయణ, బ్రాంచి సెక్రటరీ భూక్యా నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజు అన్నారు. ఈ మేరకు శనివారం కోయగూడెం ఓపెన్ పిట్ మీటింగ్‌లో నూతన సంవత్సరం కేక్ కట్ చేశారు. మాట్లాడుతూ... ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కార్మికులకు సాధించి పెడతామన్నారు. ఆరు గ్యారంటీలలో ముఖ్యమైనవి రెండు.. అందులో మొదటిది పెరిక్స్ మీద ఇన్‌కమ్ టాక్స్, సొంతింటి కల గురించి యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నిరంతరం సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటితో పలుమార్లు చర్చించినట్లు తెలిపారు. సెంట్రల్ కమిటీ సభ్యులు కోయగూడెం ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సౌరభ్ సుమన్, యూనియన్ నాయకులు రామారావు, బాసు, సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న త్యాగరాజు

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి..


విద్యార్థులకు టై, బెల్టు అందజేస్తున్న ఎంఈఓ

ఇల్లెందురూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. గ్రామపెద్దలు సమకూర్చిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థి చదువులో రాణించాలని ఎంఈఓ టీవీఆర్‌ఎన్ స్వామి సూచించారు. మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మోకాళ్ల కృష్ణ విద్యార్థుల కోసం కొనుగోలు చేసిన టై, బెల్టు, బ్యాడ్జీలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాబోధన, సౌకర్యాలు, క్రమశిక్షణలో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా మాణిక్యారం పాఠశాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, గ్రామపెద్దల తోడ్పాటుతో అభివృద్ధి చెందుతున్న పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శర్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పోరిక సత్యవతి, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, మోకాళ్ల కృష్ణ, గ్రామపెద్దలు యదళ్లపల్లి సత్యం, పొడుగు నర్సింహారావు, సత్యం, రామకృష్ణ, రాందాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఇల్లెందురూరల్: సీఎస్పీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా గ్రామానికి చెందిన గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పేదలు శనివారం ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అటవీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు ఇదే స్థలాన్ని తమదంటే తమదని ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి పేదలకు ఇళ్లు మంజూరు చేయడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, ఖాదర్, వీరభద్రం, గడ్డం వెంకన్న, వైకుంఠం, రాజు, కమల, హసీనా, విజయ, రాజేష్, కోటమ్మ, నీలరాణి, భీముడు, భవాని పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

‘సీతారామ’ కాలువల భూ సేకరణకు గ్రామసభలు

పాల్వంచరూరల్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మాణం కోసం మండలంలోని పలు గ్రామాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) జె.కార్తీక్, రెవెన్యూ శాఖ అధికారులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో శనివారం పెసా గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. దంతలబోరు, నారాయణరావుపేట, సంగం, గంగాదేవిగుప్ప గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపకలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

గ్రామాల్లో సర్వే నంబర్ల ఆధారంగా మొదట సర్వే నిర్వహిస్తామని చెప్పారు. పిల్ల కాల్వల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. ఈ సభలో రూరల్ ఆర్‌ఐ హచ్యా, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు జూనియర్ అసిస్టెంట్లు సుధాకర్, లక్ష్మణ్ స్థానికులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అరికడదాం..


మాట్లాడుతున్న పద్మావతి

ఇల్లెందు: దేశంలో క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని 2వ వార్డు కౌన్సిలర్ కటకం పద్మావతి అన్నారు. శనివారం 2వ వార్డు పరిధిలోని సత్యనారాయణపురంలో రొంపేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ షివిర్ కార్యక్రమం ద్వారా ఈ హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ.. దగ్గు, జ్వరం, అలసట, మెడ చుట్టూ, సంకలో, గజ్జలో గడ్డలు వంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకర్, హెచ్‌ఈఓ రాజు, హెచ్‌ఎస్ కృష్ణంరాజ్, హెచ్‌వీ రత్నకళ, ఏఎన్‌ఎం తిరుపతమ్మ, ఆశ వర్కర్లు కళావతి, రాధ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..


ఇల్లెందు: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను


టేకులపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

ఇల్లెందు: వాహనదారులు అతివేగం, మద్యం సేవించటం, హెల్మెట్ లేకుండా బైక్‌లు నడపటం ప్రాణాలకు ప్రమాదమని ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను అన్నారు. శనివారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ నెల 1 నుంచి 31 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా అవగాహన సభలు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ వాహనదారుడికి లైసెన్సు, ఆర్‌సీ బుక్, బీమా పత్రాలు వెంట ఉండాలని తెలిపారు. సీఐ బి.సత్యనారాయణ, ఎస్‌ఐ సందీప్ పాల్గొన్నారు.

టేకులపల్లి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ సూచించారు. ఈ మేరకు ఈనెల 31 వరకు భద్రతా వారోత్సవాల సందర్భంగా టేకులపల్లిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, సీ బుక్ అన్నిరకాల ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● ధనుర్మాస వ్రతం పూజలు


పూజకు హాజరైన తిరుప్పావై మహిళా కమిటీ సభ్యులు

ధనుర్మాస వ్రతంలో భాగంగా పాల్వంచ పట్టణంలోని శ్రీరామాలయ భజన మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వంశీ ఆధ్వర్యంలో స్వామికి వింజమరలు వీస్తూ సేవలను అందించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. తిరుప్పావై మహిళా కమిటీ సభ్యులు పెండ్యా రోజాలక్ష్మి, చలవాది రాజ్యలక్ష్మి, బిందు, శ్రీలక్ష్మి, దుర్గ, స్వప్న, సౌజన్య, దీప్తి, విశ్వాంభరి, శ్యామల, భారతి, ఇందిర, విజయ, తేజ పాల్గొన్నారు. – పాల్వంచ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148